# ఐటి పరిశ్రమలకు రాయితీలు

## నాస్‌కాం అధ్యక్షుడు సోమ్‌మిట్టల్ సూచన

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 22 (కెఎన్ఎన్): రాష్ట్ర ప్రభుత్వం ఐటి ఆధారిత సంస్థలతో కలసి ఒక ఫోరం ఏర్పాటుచేసి కలిసి పనిచేసినట్టయితే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉందని నాస్‌కాం అధ్యక్షుడు సోంమిట్టల్ అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఐటి పరిశ్రమలకు రాయితీలను కొనసాగించాలని ఆయన కోరారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్(హైసీ) 16వ వార్షిక అవార్డులను శుక్రవారం రాత్రి ఇక్కడి మాదాపూర్‌లోని దవి ఐటి పార్క్ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో అందజేసింది. వివిధ రంగాల్లో నిపుణులైన వారికి ఈ అవార్డులను బహూకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాస్‌కాం అధ్యక్షుడు సోమ్‌మిట్టల్ మాట్లాడుతూ, రాష్టంలో ఎస్టీపీలను మరింతగా విస్తరించాలని సూచించారు. దేశంలోని వివిధ ఐటి సంస్థలను ఈ ఏడాది విదేశీప్రతినిధులు సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారని, తమతో కలసి పనిచేయడానికి ఆసక్తిని చూపుతున్నారని పేర్కొన్నారు. దేశంలో ఐటి ఎగుమతుల వ్యాపారంలో 41 బిలియన్‌డాలర్ల మేరకు జరిగిందని తెలిపారు. ఐటి పరిశ్రమకు ప్రస్తుతం డిమాండ్ బాగా ఉందని, దీనికి ఇదే ప్రాచుర్యం ఉంటుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం కూడా విద్యాపరంగా మరింత అధికంగా బడ్జెట్‌లో కేటాయింపు జరిపితే ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. హైసీ అధ్యక్షుడు డాక్టర్ అనిల్‌జంపాలా మాట్లాడుతూ, హైదరాబాద్ నగంరలో ఐటి కంపెనీల వృద్ధికి అసోసియేషన్ చేసిన కృషిని వివరించారు. రాష్టంలో ఐటి పరిశ్రమలను విస్తరించడానికి ప్రభుత్వం ఎంతగానో చేయూతనిస్తున్నదని చెప్పారు. హైసీ ముఖ్యంగా చిన్న మధ్యతరహా ఐటి పరిశ్రమలతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీని కూడా తీసుకుని పనిచేస్తున్నదని వివరించారు. విజయవాడలో కూడా హైసీ శాఖను విస్తరించడం జరిగిందని అక్కడ కూడా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఐటి శాఖ కార్యదర్శి శైలేంద్ర కె.జోషి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఐటిరంగాల సంస్థల అభివృద్ధికి విశేష కృషి జరుపుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం కంప్యూటర్ సర్వీసెస్ లిమిటెడ్ ఉపాధ్యక్షులు, సంచాలకులు ఎ.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటి, ఐటిఇఎస్ కేటగిరీలతో పాటు ఎంఎన్‌సి కంపెనీల్లో బెస్ట్‌ప్రొడక్ట్, బెస్ట్ ఇన్నోవేషన్, హైయెస్ట్ సెక్యూరిటీ స్టాండర్ట్ అఛీవ్‌డ్, సేవాకార్యక్రమాలు చేసిన ఐటి సంస్థలకు ఈ సందర్భంగా అవార్డులను బహూకరించారు.




### అవార్డులు పొందిన కంపెనీలివే...

అంజాన్‌డెవలప్‌మెంట్ సెంటర్ (ఇండియా)ప్రైవేట్‌లిమిటెడ్, తాన్ల సొల్యూషన్స్ లిమిటెడ్, ఎ.ఎం.డి రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ సెంటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, బ్రిగేడ్ కార్పొరేషన్, క్యాపిటల్ ఐక్యూ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లు సర్వీసు అవార్డులను పొందాయి. ఎఫిజెంట్ ఇండియా ప్రైవేట్‌లిమిటెడ్, వింగ్స్ ఇన్ఫోనెట్ లిమిటెడ్, స్పెషల్ జ్యూరీ అవార్డు ఎస్.క్యూ. ఎల్ స్టార్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, వ్యాల్యూ మైండ్స్, టిసిఎస్ కంపెనీలు ప్రొడక్ట్, ఇన్నోవేషన్ విభాగంలో అవార్డులు పొందాయి. జెన్ టెక్నాలజీస్ క్వాలిటీ అండ్ సెక్యూరిటీ విభాగంలో అవార్డును కైవసం చేసుకుంది. ఐటి సంస్థలకు సేవ చేసినందుకుగాను ఎపిఐఐసి ఛీఫ్ ఇంజనీర్ పార్థసారథిరావుకు అవార్డును అందించారు. అలాగే విద్యార్థులకు కూడా ప్రథమ, ద్వితీయం, తృతీయం అవార్డులను బహూకరించారు.

### ఆకట్టుకున్న సంగీత కార్యక్రమాలు...

వారంలో అయిదు రోజుల కంప్యూటర్ కీబోర్డులతో కుస్తీ పట్టే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కాసింత ఆటవిడుపు కోసం చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఓలలాడించాయి. యువతీ యువకులు అనే తేడా లేకుండా పాశ్చాత్య గీతాలతో పాటు పాత, కొత్త పాటలకు అనుగుణంగా ఆటపాటలతో ఆనందంలో మునిగిపోయారు. ఉద్యోగుల్లో తేడా లేకుండా ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సాగించిన నృత్య కార్యక్రమాలు అందరినీ మైమరింపజేశాయి.